జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com






# తీర ప్రాంత విధ్వంసానికే.. ఎయిర్‌పోర్టు

* ఎయిర్‌పోర్ట్ పేరిట కార్పొరేట్‌కు ఉద్దానం భూములు
* లక్ష సంతకాలతో పోరాటానికి శ్రీకారం
* వివిధ దశల్లో పోరాటానికి సిద్ధమంటున్న పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ, రైతులు
* మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో విస్తరిస్తున్న ఉద్యమం

**మందస, జులై 5(వార్త):** కార్గో ఎయిర్ పోర్ట్ పేరిట కార్పొరేట్‌కు ఉద్దానం భూముల ధారాదత్తం చేయడానికి ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు కొనసాగబోనివ్వమని పలువురు వక్తలు అన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో కార్గో ఎయిర్ పోర్ట్‌కి వ్యతిరేకంగా లక్ష సంతకాలు సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు ఆజా శర్మ పాల్గొన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు మండలం, ఒంకులూరు గ్రామం, మందస మండలంలోని రాంపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రజాస్వామిక వాదులు మాట్లాడారు. కోనసీమను తలపించే పచ్చని ఉద్దానాన్ని, తీరప్రాంతాన్ని ధ్వంసం చేసే కార్గో ఎయిర్ పోర్ట్ మాకు వద్దని గత 8నెలలుగా వివిధ రూపాలలో దశలవారీగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి తెలియజేస్తూనే ఉన్నామన్నారు. ఉద్దానమంటే ఉద్యానవనమని తెలిపారు. ఇక్కడ లక్షలాది సంఖ్యలో జీడిమామిడి, కొబ్బరి, మునగ, పనస, అరటి, మామిడి వంటి ఎన్నో వృక్షజాతులతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగివుందని చెప్పారు. ఈ ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో సుమారు 1400ఎకరాలు భూమిని ప్రభుత్వం భూసేకరణ చేసి, వృక్షాలను తొలగిస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ వృక్షాల ఉండడం వల్లనే శ్రీకాకుళం జిల్లాకు ఆక్సిజన్ కొదవలేకుండా ఉందని, తీరప్రాంతంలో ఉన్న గ్రామాలకు భారీ తుఫానులు సమయాన ఈ వృక్షాలు రక్షణగా ఉన్నాయన్నారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని బేతాళపురం పంచాయితీ, రాంపురం పంచాయితీ, మెట్టూరు పంచాయితీ పరిధిలోని సుమారు 16గ్రామాల ప్రజలు ఈ భూములపైన ఆధారపడి జీవిస్తున్నామని చెప్పారు. తీరప్రాంత గ్రామాలైన రట్టి మొదలుకొని మెట్టూరు వరకు సుమారు 45గ్రామాలు ఉన్నాయన్నాయని, ఈ గ్రామాల ప్రజలందరూ తీవ్రంగా నష్టపోతారన్నారు. కేవలం భూమిపోయిన బాధితులే కాకుండా పరిసర ప్రాంతంలో కూడా పర్యావరణంతో కూడిన అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. భూములను కార్గో ఎయిర్ పోర్ట్ పేరిట కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి ప్రభుత్వం రైతుల అనుమతితో సంబంధం లేకుండా, ప్రజాభిప్రాయసేకరణ జరపకుండా బలవంతంగా భూసేకరణ చేస్తామంటే అంగీకరించబోమని, పూర్తిస్థాయిలో ప్రతిఘటిస్తామన్నారు. తాతలు, తండ్రుల నుండి ఈ మట్టి పైన వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని, ప్రభుత్వాలు జీడిమామిడి, కొబ్బరి, వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొబ్బరి పంటబోర్డు ఏర్పాటు చేసి అవసరమైన శాస్త్రీయ, సాంకేతిక అవగాహన, పరిజ్ఞానము రైతులుకు కల్పించాలన్నారు. మునగ, పనస, మామిడి తదితర పంటలును దళారుల దోపిడీ నుండి కాపాడి, ప్రభుత్వమే ఉద్దాన పంటలన్నీ రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ఇవేమీ చేయకుండా.. రైతులు కోరుతున్న గిట్టుబాటు ధరలు ప్రభుత్వం ఇవ్వకుండా, ఉద్దాన ప్రాంతాన్ని పూర్తిగా విధ్వంసం చేసే ఎయిర్ పోర్ట్‌కు ఇస్తామంటున్నారని, ఎయిర్ పోర్ట్ అనే బూటకపు అభివృద్ధి పేరుతో భూములు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం తప్ప, దీని అవసరం మాకు ఏ మాత్రం లేదన్నారు. భూముల్లో రైతులు పొందుతున్న ఉపాధి కంటే కార్గో ఎయిర్ పోర్ట్‌తో కొత్తగా వచ్చే ఉపాధి ఏమీ లేదని తెలిపారు. ఉన్న ఉపాధి అవకాశాలు పోయే ప్రమాదం ఉందని, తీర ప్రాంతాలు పూర్తి స్థాయిలో ఆధారపడే మత్స్య ఉపాధి(వేట) కూడా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు నాలుగు లక్షల వరకు ఈ ప్రాంతంలో వివిధ రకాల వృక్షజాతులు ఉన్నాయని, అవి నాశనం అవడమే కాకుండా పర్యావరణం తీవ్రంగా నష్టపోయే ప్రమాదము పొంచి ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలే మొక్కలు నాటమని, వాటిని రక్షించి భవితరాలను తీవ్ర వాతావరణ పరిస్థితులు నుండి కాపాడుకొనే బాధ్యత ప్రతిపౌరుడిగా మన అందరి బాధ్యత అని పిలుపునిస్తున్నాయని, కానీ దానికి పూర్తి విరుద్ధంగా ఇక్కడ పర్యావరణ నష్టానికి పూనుకోవడం చాలా దారుణమన్నారు. ప్రతీ కిలోమీటరుకు ఒక గ్రామం చొప్పున అనేక గ్రామాలు ఉన్నాయని, తీర ప్రాంతంలో విమానాశ్రయం నిర్మించి, వృక్షాలు తొలగిస్తే గ్రామాలన్నీ తుఫాన్లు బారిన పడే ప్రమాదం ఉందని, ప్రభుత్వం అన్నికోణాల్లో ఆలోచించి, తలపెట్టిన కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. రైతుల ఆవేదన, గోడుని ప్రభుత్వానికి తెలియపరుస్తూ, ఎయిర్పోర్ట్ నిర్మాణం సాధ్యము కాదని ప్రభుత్వానికి తెలియజేయాలని అజాశర్మను కోరారు. తీరప్రాంతాన్ని ధ్వంసం చేసే కార్గో ఎయిర్ పోర్ట్ వద్దని గత ఆరు నెలలుగా వివిధ రూపాలలో దశలవారీగా నిరసన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి తెలియజేస్తూనే ఉన్నామన్నారు. సర్వేలు పేరిట మరోసారి రైతుల భూమిల పైకి వస్తే సహించేది లేదని గట్టిగా నినదించారు. ఎయిర్ పోర్ట్‌కి వ్యతిరేకంగా లక్ష సంతకాలు సేకరించి, ప్రభుత్వానికి ఈ మెమోరాండం అందించే కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు జోగి అప్పారావు, పొట్టి ధర్మారావు, చీకటి ధనుంజయ, సీపీఐ ఎంఎల్ నాయకులు వంకల మాధవరావు, డా.వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ మాజీ బత్తిని లక్ష్మణ్, పోతనపల్లి కుసుమ, సాలీన వీరస్వామి, పత్తిరి దానేశ్, గుంటు రామస్వామి, కొనారి మోహనరావు, మద్దిల రామారావు, తెప్పల అజయ్, చాపర వెంకటరావు, పాలవలస ధర్మారావు, గొరకల బాలక్రిష్ణ, కోనేరు రమేష్, పోతనపల్లి కామేశ్వరరావు, జుత్తు భూపతి, మర్ల సంతోష్, గుంటు వల్లభారవు, బాధిత రైతులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.




పాఠశాల మధ్యాహ్న భోజనానికి..

# పురుగుల బియ్యం




* ఈ బియ్యంతో అన్నం వండలేమంటున్న ఎండీఎం నిర్వాహకులు
* తలలు పట్టుకుంటున్న హెచ్ఎంలు

**శ్రీకాకుళం, జులై 5 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం రోజు నుంచే మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యంతో అన్నం వండి విద్యార్థులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం పేరుతో మెనూ మార్పులు చేసింది. ఇందులో భాగంగా సన్నబియ్యం అందించేలా చర్యలు తీసుకుంది. పౌరసరఫరాలశాఖ గోదాముల నుంచి రాష్ట్రంలో అన్ని పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు జూలై నెలలో పంపిణీ చేసిన సన్నబియ్యంలో సుంకి పురుగులు, సాగే పురుగులు, నూకలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ పురుగుల బియ్యంతో అన్నం వండి పిల్లలకు ఏవిధంగా పెడతామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. ఈ బియ్యంతో వండిన అన్నాన్ని తినడం లేదని, పారబోయాల్సివస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. నరసన్నపేట మండలం బసివలస పాఠశాలకు పంపిణీ చేసిన ఈ సన్న బియ్యంలో శనివారం సాగే పురుగులు కనిపించాయి. దీంతో ఎండీఎం నిర్వాహకులు ఈవిషయాన్ని హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. తక్షణం ఈ బియ్యాన్ని మార్చాలని ఎండీఎం నిర్వాహకులు కోరుతున్నారు. కాగా, జిల్లాలో చాలా వరకూ పాఠశాలలకు పంపిణీ చేసిన బియ్యం సాగే పురుగులు, సుంకి పురుగులు కనిపిస్తున్నాయని హెచ్ఎంలు చెబుతున్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలకు పురుగులు లేని బియ్యం సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# శ్రీ చైతన్యలో అగ్ని ప్రమాదం

* షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు
* కాలిపోయిన ప్యానెల్ బాక్సు
* పరుగులు తీసిన విద్యార్థులు
* తృటిలో తప్పిన ముప్పు

**శ్రీకాకుళం క్రైం, జూలై 5 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఉన్న శ్రీ చైతన్య కళాశాలలో శని వారం అగ్ని ప్రమాదం జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఎలక్ట్రికల్ ప్యానెల్ బాక్సు వద్ద ఒక్క సారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాప్తి చెందాయి. దీన్ని గమనించిన కొందరు సిబ్బంది మెయిన్ స్విచ్ ఆపి మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. మరి కొందరు బకెట్లలో నీటిని తీసుకువచ్చి ఆ ప్యానెల్ బాక్స్‌పై వేసి మంటలు వ్యాపించ కుండా నివారించారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈ కళాశాల భవనం ఇరుకుగా అగ్గిపెట్టేలా ఉంటుంది. దీనిలో సుమారు 800 మంది వరకూ విద్యార్థులు చదువుతున్నారు. మంటలు ఎక్కువగా చెలరేగితే పెద్ద ప్రమాదమే జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందంటూ విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు.



## మహిళా సంఘాల ప్రగతికి పది రాజీలేని సూత్రాలు



**మందస, జులై 5(వార్త):** స్వయంశక్తి మహిళల ప్రగతికి పది రాజీ లేని సూత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని, అందరూ పాటించాలని మందస వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు కోరారు. మందసలో మహిళలతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పది సూత్రాలను వివరించారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం మాత్రమే సభ్యురాలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు ఇవ్వాలన్నారు. అప్పు తీర్చాల్సిన బాధ్యత సంఘం మొత్తానిది అన్నారు. ఆర్థిక అంశాలతో పాటుగా సామాజిక బాధ్యతలు పాటిస్తూ, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా గ్రామ సంఘం సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## 10న జిల్లావ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్ మీటింగ్

**-తల్లిదండ్రులు అర పూట కేటాయించాలి**

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూని యర్ కళాశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌కుమార్‌తో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల విద్యా పురోగతి, ఆరోగ్య వివరాలు తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా పిల్లల భవిష్యత్తుపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని చెప్పారు. తల్లిదండ్రులను ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించాలని సూచించారు. జిల్లాలో 2638 ప్రభుత్వ, 389 ప్రైవేట్ పాఠశాలలు, 94 ప్రభుత్వ, 71 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు వివరించారు.



## కొత్తకోటలో బహుళ ప్రయోజన గిడ్డంగి ప్రారంభం



**సరుబుజ్జిలి, జులై 5(వార్త):** సరుబుజ్జిలిలో నిర్మించిన బహుళ ప్రయోజన గిడ్డంగిని ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గిడ్డంగి ఆదాయాన్ని తొలుత కేంద్రానికి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, ఆమదాలవలస నియోజక వర్గ పరిశీలకుడు వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవింద రావు, మండల టీడీపీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, మండల నాయకులు కిల్లి సిద్దార్థ, ఎస్సీ సెల్ డైరెక్టర్ బోనెల అప్పారావు, తహసీల్దార్ మధుసూదనరావు, పల్లి సురేష్, గురువు తిరుమలరావు, తర్లాడ సురేంద్ర, మండల టీడీపీ యువత అధ్య క్షుడు ధవళ సింహాచలం, జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళి, కూన గణపతి, పెడడా మనమ్మ, యండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకర్, కూటికుప్పల కోటి, వెలుపల గోవిందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో వంశధార సాగునీరు సాధన



**మందస, జులై 5(వార్త):** వంశధార సాగునీరు సాధనకు మరో పోరాటం అవసర మని, అందరి సహకారంతో సాధించగలమని వంశధార సాగునీటి సాధన కమిటీ నాయకులు అన్నారు.

మందస మండలంలోని వెంకటవరదరాజపురం, గోవిందపురం రైతులతో వారు సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అంపోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక ఒక పంట కూడా పండించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామ రైతులు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, కొర్ల హేమారావుచౌదరి, నల్ల హడ్డి, దుంపల వైకుంఠరావు, కర్రి గోపాలకృష్ణ, కొవ్వూరు దాశరథి, వాయిల పల్లి పాపారావు, మజ్జి రమణ, గొర్రెల సోమేశ్వరరావు, వాయలపల్లి రవణ, రైతులు పాల్గొన్నారు.

# కనుల పండువగా బహుడా



**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** ఉత్కలంధ్రుల ఆరాధ్యదైవం జగన్నాథస్వామి మారు రథయాత్ర వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు గుండీచ మందిరంలో దర్శనమిచ్చిన బలభద్ర సుభద్ర సమేత జగన్నాథుడు రథంపై దాసన్నపేట, మెయిన్ రోడ్డు, బజార్ రోడ్డు మీదుగా ఆలయానికి చేరుకున్నారు. మేళ తాళాలతో భజన గోష్ఠితో రథయాత్ర సాగింది. ఆలయంలో లక్ష్మీ నారాయణ సంవాద ఘట్టం ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఈదుపురంలో రథయాత్ర జరిగింది.



## సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

**సరుబుజ్జిలి, జులై 5(వార్త):** సరుబుజ్జిలిలో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై సమీకృత పశువుల దాణాను రైతులకు పంపిణీ చేశారు. ఈ దాణాను ఎమ్మెల్యే కూన రవికుమార్ రైతులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో 'పూజ' ఔదార్యం



**మందస, జులై 5(వార్త):** రక్తదానంలో తాము కూడా ముందున్నామంటూ నిరూపిస్తున్నారు మహిళలు. జస్వంత్ అనే బాలుడు తలసేమియా వ్యాధితో బాధ పడుతుండగా.. రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న బొప్పాయిపురం గ్రామానికి చెందిన పూజ ఆ నలుగురు ట్రస్ట్ వ్యవస్థాపకుడు పిచ్చుక పాపారావు సహకారంతో రక్తదానం చేశారు. ఆమెకు ట్రస్ట్ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## తడి..పొడి చెత్త వేరు చేయండి




**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** ఇంటింటా చెత్త సేకరణ కోసం పారిశుధ్య కార్మికులకు సహకరించాలని ఎంపీడీవో రామారావు కోరారు. హరిపురంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ కింద తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్త బుట్ట, సంచి విధానాన్ని వివరించారు. నీటి నమూనాలు సేకరించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దక్కత రామారావు, వడ్డిన కురాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'ఫిట్‌నెస్ సెంటర్ తరలించలేం'

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** ఇచ్ఛాపురంలో వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్‌ను పునరుద్ధరించాలని రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాకు సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి విన్నవించారు. విజయవాడలోని కార్యాలయంలో ఆయనను కలసి సమస్య తీవ్రతను వివరించారు. ఈ అంశం కేంద్ర నిబంధనలు ప్రకారం తీసుకున్న నిర్ణయమని, జిల్లాకు ఒకే ప్రాంతంలో..జిల్లా కేంద్రానికి దగ్గరలో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయండి

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని వైస్సార్సీపీ నాయకులు కోరారు. శనివారం వారు ఎంపీడీవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్‌లు నర్తు ప్రసాద్, సంతోస్ మండలో, పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, ఆసి దాలయ్య రెడ్డి, వలపల వెంకటరమణ, ప్రియా నాయక్ తులసిరాం, కరింగి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పదవీ విరమణ ఉద్యోగుల సమావేశం

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** శ్రీకాకుళం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో శనివారం ట్రెజరీ విభాగంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాల ట్రెజరీ శాఖల నుండి ఉద్యోగ విరమణ పొందిన వందలాది మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రెజరీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ట్రెవా అనే సంఘం ఏర్పాటుకు నిర్ణయించారు. అధ్యక్షులుగా అంకడాల తవిటన్న, ఉపాధ్యక్షులుగా భీష్మాచార్యులు, కార్యదర్శిగా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎ.కోటేశ్వరరావు, కోశాధికారిగా ఆర్ఎస్ పట్నాయక్‌ను ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా చీఫ్ ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రయ్య, డిప్యూటీ ట్రెజరీ ఆఫీసర్ వెంకటరావు హాజరై ప్రసంగించారు.



## డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** రత్తకన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జోన్ 1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ పివి కృష్ణాజీ సందర్శించారు. కళాశాలను అభివృద్ధి చేయాలని, స్టూడెంట్స్ సంఖ్యను పెంచాలని ఫ్యాకల్టీకి సూచించారు. భువనేశ్వర్ ఐఐలో సీటు సాధించిన గుడియా జ్యోతి, హైదరాబాద్ ఐఐటీలో సీటు సాధించిన బాకీ ఈశ్వరి, తిరువూనంతపూర్‌లో ఎంఎస్ సీటు సాధించిన బాధిత్య పూజితకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ రబిన్ కుమార్ పాడి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, నాగేశ్వరావు, సంతోష్‌కుమార్, రాజేంద్ర త్రిపాఠీ, మోహన్ రావు పాల్గొన్నారు

## ప్రజలకు ఆరోగ్యకరమైన చికెన్‌ను అందించండి



**పలాస, జులై 5(వార్త):** ప్రజలకు ఆరోగ్యకరమైన చికెన్‌ను అందించాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మున్సిపాలిటీలో గల అన్ని చికెన్ షాపుల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి షాపు ఓనర్ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఊరికి దూరంగా చికెన్ వేస్ట్‌ను తరలించాలని కోరారు. షాపుల వద్ద పరిశుభ్రత పాటించాలని, నిత్యం ఫినాయిలు వాడాలని వారికి సూచించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



**పలాస, జులై 5(వార్త):** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పలాస ఎంపీడీవో వసంతకుమార్ అన్నారు. అల్లుకోల పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు రోగాలు బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. వీధులు, మురికి కాలువలు, వీధుల్లో పేరుకు పోయిన చెత్తా చెదారంను తొలగించి పారిశుధ్యం మెరుగు పరచాలని సూచించారు. చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి వ్యవసాయానికి వినియోగిస్తామని చెప్పారు. ఆయన వెంట పలాస డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, సర్పంచ్ దువ్వాడ వామాక్షి, దువ్వాడ రవికుమార్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవ కుటుంబానికి శ్రీకాంత్ పరామర్శ

**పలాస, జులై 5(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దేవ లక్ష్మణమూర్తి మృతిపై సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ తన సంతాపాన్ని తెలిపారు. శనివారం ఆయన ..లక్ష్మణమూర్తి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మూర్తి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ దేవ లక్ష్మణమూర్తి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చల్ల రమేష్, గుండుపల్లి మోహన్ రావు, కుటుంబ సభ్యులు జర్నలిస్ట్ నాని తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్‌లో 2780 కేసుల రాజీ

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా**

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** జాతీయ లోక్ అదాలత్‌లో 2780 కేసులు రాజీ అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సివిల్ కేసులు 150, క్రిమినల్ కేసులు 2582 , ప్రీ లిటిగేషన్ కేసులు 48 వీటిలో ఉన్నాయన్నారు. జిల్లా కోర్ట్ ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జిలు పి భాస్కర రావు, ఎం శ్రీధర్, కె హరిబాబు, జన్నత్ బేగం, జి సువర్ణ రాజు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు, జి.ఇందిరాప్రసాద్, గేదెల వాసుదేవరావు పాల్గొన్నారు.



**పలాస, జులై 5(వార్త):** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పలాస కోర్టులో పలు కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి యు.మాధురి శనివారం తెలిపారు. 98 క్రిమినల్ కేసులు, 4సివిల్ కేసులు, నేరం అంగీకరించిన కేసుల్లో 146 అడ్మిషన్స్, డ్రంకెన్‌డ్రైవ్‌లో రూ.10,000, పబ్లిక్‌గా మందు తాగినందుకు రూ.1000లు అప రాధ రుసుము విధించామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫైయాజ్‌అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ బీకేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్ రాజు, లోక్ అదాలత్ మెంబెర్ జి.ప్రభాకర్, రవి, చందశేఖర్, రాజారత్నం నాయుడు, తాండ్ర మురళి, పిండి వెంకటరావు, ఏపీపీ రమేష్, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, కానిస్టేబుల్ కోటి కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**పలాస, జులై 5(వార్త):** తక్షణమే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎడి కుమార్, కణితి దశరథరావు డిమాండ్ చేశారు.

పలాస ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. 2019 సర్క్యులర్ అమలుపరచాల న్నారు. డ

డబల్ డ్యూటీ చేసే సిబ్బందికి డీఏ పెంచాలని డిమాండ్ చేశారు.

ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ సొంతంగా నడపాలి అన్నారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ



**సరుబుజ్జిలి, జులై 5(వార్త):** సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సామాజిక నేరాలు, స్వీయ రక్షణ, మోసాలపై అప్రమత్తంగా ఉండాలని శక్తి టీం సిబ్బంది తెలిపారు.శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, నిర్దేశించిన వివిధ ఫోన్ నెంబర్లు, హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో శక్తి యాప్ టీం హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణరావు, మోహనరావు, జనార్దనరావు, కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి రమేష్ సాహూ, గొండు శ్రీనివాసరావు, వినోద్‌రాజు, విజయ్ కుమార్, గౌతమీవీణ, గోవిందరావు, విజయ, ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం, జులై 5 (వార్త):** శక్తి యాప్ ఫోన్లో ఉంటే సురక్షితంగా ఉన్నట్లే అని విద్యార్థినుల, మహిళలకు శక్తి యాప్ సభ్యులు శనివారం అవగాహన కల్పించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో మహిళా ప్రయాణికులకు శక్తి యాప్ ప్రాధాన్యత గురించి తెలిపారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళా చట్టాలు, సైబర్ నేరాలను వివరించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఈనెల 9న పలాసలో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం




**పలాస, జూలై 5 (వార్త):** ఈ నెల 9న మధ్యాహ్నాం 2గంటలకు ప్రగతి భవన్ ప్రాంగణంలో జరగనున్న విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. శనివారం ప్రగతి భవన్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను ఎగ్గొట్టిన తీరును ప్రజల్లోకి బలంగా తీసుకు పోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలే ఎండగడుతున్నారని వెల్లడించారు. ఈ తీర్మాన కార్యక్రమంలో మూడు మండలాలు మరియు మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నూతన కార్యవర్గ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సుపరిపాలనలో తొలి అడుగు



**పలాస, జులై 5(వార్త):** మున్సిపాలిటీ అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ట్రేడ్ యూనియన్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు స్పష్టం చేశారు. శనివారం ఒకటో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వము వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజల అభిమానాన్ని కోరుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, మల్లా శ్రీను, గురిటి సూర్యనారాయణ, అంబటి కృష్ణమూర్తి, కెల్లి ఆనంద్, రాధిక, కుమ్మరి శివాజీ, బుడత జగదీశ్, బర్ల కృష్ణ కుమ్మరి, ఆత్మరావ్, బొంపల్ల అప్పారావు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

**టెక్కలి, జులై 5(వార్త):** పేద ప్రజల సంక్షేమానికి పథకాలను ప్రవేశపెడుతున్న ప్రభుత్వం కూటమి అని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు అన్నారు. బూరగాం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాననేఇ్న శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, ఇప్పిలి జగదీశ్వర రావు, దల్లి ప్రసాద్ రెడ్డి, గేదెల సంజీవ్ రెడ్డి, జనపాన రూపావతి, గేదెల రమణయ్య, గేదెల శ్రీను, ఎర్రన్న రెడ్డి, జనపాన తేజ, కోదండ నీలపు అరుణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





**టెక్కలి, జులై 5(వార్త):** తెలుగుదేశం పార్టీ పేద ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని నెరవేర్చడమే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం ఆయన కోటబొమ్మాళి మండలం చిన్న బమ్మిడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి, కూటమి పాలనలో చేసిన అభివృద్ధికి ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం వదిలి వెళ్లిన పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ తిరిగి తెస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

**మందస, జులై 5(వార్త):** ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం శనివారం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏడాది విజయాలను ప్రజలకు నాయకులు వివరించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జి, టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు మాట్లాడుతూ తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, పెరిగిన పెన్షన్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, అన్నదాత సుఖీభవలాంటి పథకాలు కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి బైరిశెట్టి గున్నయ్య, క్లస్టర్ కో ఆర్డినేటర్ చౌదరి మురళీకృష్ణ, నారాయణపురం టీడీపీ అధ్యక్షుడు మల్లేన జనార్దన్, మాజీ సర్పంచ్ బొంగు దామోదర్, సివంగి మురళి, మడియా ధర్మా రావు, రెయ్యి రాజు, గొరకల దుర్యోధన, టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.






**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం 1, 2వార్డులలో గాలి పాపారావు రెడ్డి, కాతిల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య, నందిగం కోటి, కౌన్సిలర్ ఆశి లీలారాణి, కొండ శంకర్ రెడ్డి, నీలాపు వెంకట్ రెడ్డి, నారాయణ బేహారా, దొరబాబు, సంతోష్ రథో, అసి మోహన్, ఉప్పడా కృష్ణ, జీలని, పైల నారాయణ, సాలీనా ఢిల్లీ, కాళ్ల దిలీప్ యాదవ్, శాసన శేఖర్, దట్టి శ్రీను, గిన్నీ చిన్న, రెయ్యి జాని, సుభాష్ రౌలో, బత్తిన కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**పలాస, జూలై 5 (వార్త):** బడుగు బలహీన వర్గా కు అండగా ఉంటూ వారి సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. గరుడ ఖండి గ్రామ పంచాయతీలో శనివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారని భావన దుర్యోధన అన్నారు. కార్యక్ర మంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దువ్వాడ సంతోష్ నాయుడు, శ్రీహర్షనాయుడు, హేమారావు చౌదరి, సాసుమాన సంతోష్, నాని, సీతారాం, బూర్లె కృష్ణంరాజు, ఎదల్లనాయుడు, పాల్గొన్నారు.





## సీసీఆర్‌సీ కార్డు జారీపై అవగాహన

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** సీసీఆర్‌సీ కార్డు జారీపై గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులు కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. భూమి సాగు చేస్తున్న రైతులకు చట్టబద్ధమైన హక్కులను కల్పిస్తూ, ప్రభుత్వ మద్దతు, ప్రయోజనాలు అందించడానికి అవసరమైన పత్రాలు సిద్ధం చేయడంపై స్పష్టత ఇచ్చారు. కార్డు జారీకి అవసరమైన ధ్రువపత్రాలు, సర్వే నంబర్లు, భూమి వివరాల నమోదు, సకాలంలో నమోదు ప్రక్రియ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ పోర్టల్‌ను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్ సూచించారు. తమ సమస్యలను రైతు సేవా కేంద్రాలు ద్వారా ఇందులో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పోర్టల్‌లో నమోదు చేసుకునే రైతులు తప్పనిసరిగా 1బీ అడంగల్, ఆధార్ కార్డు ప్రతులు, బ్యాంక్ ఖాతా వివరాలు, జీఎస్‌డబ్ల్యూ సర్వే నంబర్, వెబ్‌ల్యాండ్‌లో పేరు నమోదై ఉండాలని తెలిపారు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి



**పలాస, జులై 5(వార్త):** కూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపైన భారాన్ని మోపిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, సీపీఐ జిల్లా సహజ కార్యదర్శి లండ వెంకటరావు అన్నారు. శనివారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలపై విద్యుత్ చార్జీల భారాలను మోపడం సరికాదని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని అని చెప్పిన కూటమి.. అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను రంగంలోకి తీసుకువచ్చి బిగిస్తున్న పరిస్థితి అందరికీ తెలిసిందేనన్నారు. అధికారంలో ఒక మాట..ప్రతిపక్షంలో మరొక మాటగా.. ప్రభుత్వం కొనసాగుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మోసగించవద్దన్నారు. తక్షణమే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ లను రద్దుచేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుందర్‌రావు, హరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

**నరసన్నపేట, జూలై 5 (వార్త):** ప్రజలపై ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో వారిపై భారాన్ని మోపిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. శనివారం వారు నరసన్నపేటలో ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలపై విద్యుత్ భారాలను మోపడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ లను రద్దుచేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మధుసూదనరావు, భాస్కరరావు, వెంకటరమణ, లవుడు, చిన్నబాబు, కర్ణవీరుడు, రాజు, రాములమ్మ, అమరనాథ్, ఎర్రయ్య, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.




## వైభవంగా.. మారు రథయాత్ర



**శ్రీకాకుళం, జూలై 5(వార్త):** జగన్నాథ మారు రథయాత్ర ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలోని గుండిచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా నిర్వహించారు. అనంతరం స్వామివారిని రథంపైకి మేళతాళాల నడుమ ఎక్కించారు. అక్కడి నుంచి బొందిలీపురంలోని జగన్నాథ మందిరానికి రథంపై ఊరేగింపుగా తరలించారు. పెద్ద ఎత్తున భక్తులు జై జగన్నాథ్ అంటూ నినాదాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546